Facebook.varadhinews

# వారధి

తెలుగు దిన పత్రిక

www.varadhinews. com

సంపుటి:1
సంచిక:15
బుధవారం,
18.09.2024



## బై.. బై.. గణేశా..

- గంగమ్మ ఒడికి చేరిన గణనాథులు
- హైదరాబాద్‌లో వైభవంగా ఖైరతాబాద్ గణేశుడి శోభాయాత్ర
- జనసంద్రమైన ట్యాంక్ బండ్
- భక్తులతో కలిసి శోభాయాత్రలో పాల్గొన్న సీఎం రేవంత్ రెడ్డి

7 లో

### గణేశ్ లడ్డూ @ 1.87 కోట్లు

బండ్లగూడ కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో రికార్డు ధర
గతేడాది 1.20 కోట్లు పలికిన లడ్డూ

7 లో



## ఢిల్లీ కొత్త సీఎంగా అతిశీ

- రాజీనామా చేసిన కేజ్రీవాల్
- వారం రోజుల్లో కొత్త సీఎం ప్రమాణస్వీకారం
- ఆపద్ధర్మ సీఎంగా కొనసాగనున్న కేజ్రీవాల్

2 లో



## త్రివిక్రమ్‌ను ప్రశ్నించండి


- గతంలో ఫిర్యాదు ఇచ్చినా పట్టించుకోలేదు
- ట్విట్టర్ వేదికగా పూనం కౌర్ ఆగ్రహం
- సీఎంతో చర్చించి జానీ మాస్టర్‌పై చర్యలు
- మీడియాకు వెల్లడించిన ఫిలిం చాంబర్ సభ్యులు

2 లో

## బానిసలుగా మారొద్దు..

2 లో

- వాస్తవాలు తెలిపేందుకు విమోచన దినోత్సవం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు



## రైతు కూలీలకు ఏటా రూ.12,000

- వ్యవస్థలను గాడిలో పెడుతున్నాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- సన్న వడ్లకు రూ.500 బోనస్
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**వారధి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ సర్కార్ మరో గుడ్ న్యూస్ చెప్పనుంది. భూమి లేని రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇచ్చే ఆలోచన చేస్తున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో పర్యటించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క... మీడియాతో మాట్లాడుతూ ప్రజల చేత, ప్రజల అవసరాల



2 లో

## నేను ఫామ్‌హౌస్ సీఎం కాదు..

# పనిచేసే ముఖ్యమంత్రిని

- ప్రజల ఆలోచనే మా ఆచరణ
- తెలంగాణ అంటేనే త్యాగం, బలిదానం
- విలీనం, విమోచనం అనడం సరికాదు
- నియంత పాలన నుంచి విముక్తి
- పదేళ్లలో రాష్ట్రాన్ని నాశనం చేశారు
- ధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నం
- రాష్ట్రానికి మేలు చేయడం కోసం ఏదైనా చేస్తా
- ఎన్నిసార్లైనా ఢిల్లీకి వెళతా
- సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- పబ్లిక్ గార్డెన్స్‌లో ఘనంగా ప్రజాపాలన దినోత్సవ వేడుకలు



**వారధి, స్టేట్ బ్యూరో:**

రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడిన ఘనత తెలంగాణ ప్రజలదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ అంటేనే త్యాగం, బలిదానమని చెప్పారు. విలీనం, విమోచనం అంటూ స్వప్రయోజనాల కోసం యత్నించడం సరికాదని అన్నారు. నియంత నుంచి తెలంగాణకు విముక్తి కలిగిస్తామని ఆనాడు భరోసా ఇచ్చామని... పదేళ్ల పాటు కేసీఆర్ పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని మళ్లీ గాడిలో పెడుతున్నామని చెప్పారు. ప్రభుత్వం తరపున పబ్లిక్ గార్డెన్స్‌లో ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ పాలన పారదర్శకంగా ఉండాలని కోరుకుంటున్నామని సీఎం తెలిపారు. ప్రతి ఏటా సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించాలని నిర్ణయించామని చెప్పారు. గత పదేళ్లగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను నాశనం చేశారని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీకి వెళ్తుంటే... తనపై విమర్శలు చేస్తున్నారని

2 లో

# త్వరలో రైతు భరోసా

- ఎకరానికి రూ.15 వేల చొప్పున అందజేత
- రైతు రుణమాఫీ చేసి చరిత్ర సృష్టించాం
- తెలంగాణను ఆదర్శ రాష్ట్రంగా తయారుచేస్తాం
- మంత్రి కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు

**వారధి న్యూస్, వరంగల్:**

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ఆరు గ్యారెంటీలలో రైతు భరోసా ఒకటి. రైతు భరోసా పథకం కోసం ప్రతీఒక్క రైతు ఎదురుచూస్తున్న పరిస్థితి. ఈ క్రమంలో రైతు భరోసాపై మంత్రి కొండా సురేఖ కీలక వ్యాఖ్యలు చేశారు. రైతు భరోసా పథకాన్ని త్వరలోనే అమలు చేస్తామని మంత్రి ప్రకటించారు. రైతు భరోసా పథకం కోసం ప్రతీఒక్క రైతు ఎదురుచూస్తున్న నేపథ్యంలో మంత్రి ఇచ్చిన ప్రకటన ఊరటనిస్తుందనే చెప్పొచ్చు. ఎన్నికల సమయంలో రైతులకు ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీనిచ్చింది. అయితే ఇంతవరకు దాన్ని అమలు చేయలేదు. ఈ క్రమంలో త్వరలో రైతు భరోసా పథకం ప్రారంభించుకోబోతున్నామని మంత్రి ప్రకటించారు. అర్హులైన రైతులందరికీ రైతు భరోసా పథకాన్ని ఎకరానికి 15 వేల రూపాయల చొప్పున అందించాలన్నది మా ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. రైతు భరోసా పథకాన్ని సక్రమంగా అమలు చేయాలన్న లక్ష్యంతో విధివిధా



నాలు రూపొందిస్తోంది. దీనికోసం ప్రభుత్వం మంత్రి వర్గ ఉప సంఘాన్ని నియమించింది. ఈ ఉప సంఘం రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి రైతులు, రైతు సంఘాలు, రైతు కూలీలు, మేధావుల నుంచి అభిప్రాయాలను సేకరించిందని తెలిపారు.

## 'బుల్డోజర్ న్యాయం' ఆపండి

- అక్టోబర్ 1 వరకూ కూల్చివేతలు వద్దు
- లేటైతే కొంపలేం మునిగివు
- సుప్రీంకోర్టు సంచలన తీర్పు



**వారధి న్యూస్, న్యూఢిల్లీ**

దేశవ్యాప్తంగా 'బుల్డోజర్ న్యాయం'పై సుప్రీంకోర్టు మంగళవారం కీలక తీర్పు వెలువరించింది. నేరగాళ్లకు సంబంధించి అక్రమ నిర్మాణాలను బుల్డోజర్లతో కూల్చేసే ప్రక్రియకు అక్టోబర్ 1 వరకూ బ్రేక్ వేసింది. దేశవ్యాప్తంగా ఇటీవల

2 లో

## హైడ్రాపై తగ్గేదేలే

- ఎంత పెద్దవారైనా వదిలిపెట్టం
- ఎన్ని విమర్శలొచ్చినా కూల్చివేతలు ఆపం
- దీని వెనక ఎలాంటి రాజకీయ ఉద్దేశాల్లేవు
- సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు



2 లో

వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com


# బానిసలుగా మారొద్దు..

- రజాకార్ల వారసుల పార్టీతో అంటకాగడం సిగ్గు చేటు
- వాస్తవాలు తెలిపేందుకు విమోచన దినోత్సవం
- కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు
- పోరాట యోధులను రాష్ట్ర ప్రభుత్వం మరిచిపోయింది
- విమోచన వేడుకల్లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



**వారధి, స్టేట్ బ్యూరో:**

గత పాలకులు చరిత్రను మరుగున పడేసేలా కుట్రలు చేశారని, అధికారికంగా నిర్వహించకపోవడమంటే యోదుల త్యాగాలు, బలిదానాలను అవమానించడమేనని, వాస్తవాలను ప్రజలకు తెలిపేందుకే మూడేండ్ల నుంచి తెలంగాణ విమోచన దినోత్సవాలు జరుపుతున్నామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్ లో జరిగిన తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలందరికీ పేరు పేరునా తెలంగాణ విమోచన దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. భారతదేశానికి స్వాతంత్రం వచ్చింది ఆగస్ట్ 15 అయితే తెలంగాణకు స్వాతంత్రం వచ్చింది సెప్టెంబర్ 17 నే అని తెలిపారు. ఈ రోజు నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించి, హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైనదని, కానీ గత పాలకులు వాస్తవాలను ప్రజలకు తెలియకుండా చరిత్రను మరుగున పడేసే కుట్రలు చేశారని అన్నారు. ఈ వాస్తవాలను కళ్లకు కట్టినట్టు చూపాలనే ఉద్దేశంతో "రజాకార్" సినిమా తీసిన గూడూరు నారాయణ రెడ్డి అభినందనలు తెలిపారు. అలాగే భావితరాలకు నిజానిజాలు తెలియాలని మూడేండ్ల నుంచి కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాలు జరుపుతున్నామని అన్నారు. నిజాం నిరంకుశ పాలనలో రజాకార్ల ఆక్రుత్యాలను తలుచుకుంటే ఇప్పటికి నా రక్తం మరుగుతుందని, సర్దార్ వల్లభాయి పటేల్ లేకపోతే తెలంగాణకు అంత తొందరగా విముక్తి లభించేది కాదన్నది నగ్న సత్యం అన్నారు. దురదృష్టవశాత్తు రాష్ట్రంలోని పాలకులెవరూ ఇప్పటి వరకు అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవాలను నిర్వహించకపోవడం బాధాకరమని, తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించకపోవడమంటే నాటి సమర యోధుల త్యాగాలను, బలిదానాలను అవమానించడమేనని మండిపడ్డారు. ఇక మేము మాట్లాడితే కొందరు మతం రంగు పులుముతున్నారని, మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, మేము సామాన్య ముస్లిం ప్రజలకు ఎన్నడూ వ్యతిరేకం కాదని చెప్పారు. నేడు కొన్ని పార్టీలు ఆ రజాకార్ల వారసుల మెప్పు పొందేందుకు తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించడం లేదని, దేశ విచ్ఛిన్నకర శక్తుల వారసుల పార్టీతో అధికార పార్టీలు అంటకాగడం సిగ్గు చేటని దుయ్యబట్టారు. అధికారంలో లేనప్పుడు తెలంగాణ విమోచన దినోత్సవం ఎందుకు జరపడం లేదని ప్రశ్నించినోళ్లే అధికారంలోకి వచ్చాక మాట మార్చి, పేర్లు మార్చి తెలంగాణ సమైక్యతా దినోత్సవం అని ఒక పార్టీ, తెలంగాణ ప్రజా పాలనా దినోత్సవం అని మరొక పార్టీ ప్రజలను ఏమార్చాలనుకోవడం బాధాకరమన్నారు. పిడికెడు మంది రజకార్ల వారసుల కోసం బానిసలుగా మారి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని నిర్వహించకపోవడం ఎంత వరకు న్యాయమో ఆలోచించాలని, రజకార్ల వారసుల సంతూష్టీకరణ విధానాలను విడనాడాలని సూచించారు. ఇక గణతంత్ర దినోత్సవం, పంద్రాగస్టు మాదిరిగా వచ్చే ఏడాది నుండి తెలంగాణ విమోచన ఉత్సవాలను నిర్వహంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తే కేంద్రం భాగస్వామి అయ్యేందుకు సిద్ధమని తెలంగాణ విమోచన పోరాట అమరవీరుల సాక్షిగా తెలియజేస్తున్నామని అన్నారు.

**దేశానికి ఆగస్టు 15.. తెలంగాణకు సెప్టెంబర్ 17**

తెలంగాణ చరిత్రలో ఎన్నో విషాద గాథలను లిఖించింది. నిజాం పాలనలో దేశ్‌ముఖ్‌లు, దొరలు, జాగీర్దార్లు అమాయక ప్రజలను చెరబట్టారు. అణచివేతకు గురైన వేలాది మంది ప్రజల వీరోచిత పోరాటం ఫలితంగా నిజాం పాలన నుంచి తెలంగాణకు విమోచనం కలిగిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన సెప్టెంబర్ 17న విమోచన దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథులుగా కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసిన కిషన్ రెడ్డి తెలంగాణ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. అనేక బలిదానాలు, ఎందరో త్యాగాల అనంతరం తెలంగాణకు స్వాతంత్ర్యం సిద్ధించిందని, నిజాం రజాకార్ల మెడలు వంచి తెలంగాణ సాధించడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర సాహసోపేతమైన నిర్ణయం అని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. దేశానికి ఆగస్ట్ 15 ఎలాగో.. తెలంగాణకు సెప్టెంబర్ 17 కూడా అలాగే అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణకు నిజాం నుంచి విముక్తి లభించిన రోజును, తెలంగాణ పోరాట యోధులను రాష్ట్ర ప్రభుత్వాలు మర్చిపోయాయన్నారు. స్వార్థ, ఫిరాయింపు రాజకీయాలను తిప్పికొడదామని పిలుపునిచ్చిన కిషన్ రెడ్డి. బలమైన పునాదుల తెలంగాణను నిర్మించుకుందామన్నారు. తెలంగాణ చరిత్ర సుసంపన్నమైనదని, అద్భుతమైన పోరాటాలు, అసమాన త్యాగాలు, నిరుపమైన సేవలు దాగి ఉన్నాయన్నారు. గుండె తరుక్కుపోయే దారుణాలు ఉన్నాయన్నారు. తెలంగాణ చరిత్రను ఈ ప్రభుత్వాలు గుర్తించడం లేదని ఆందోళన వ్యక్తం చేసిన కిషన్ రెడ్డి, రాష్ట్ర చరిత్రను ముందు తరాలకు తెలియజేసే బాధ్యత యువతదే అన్నారు.




## నేను ఫామ్‌హౌస్ సీఎం కాదు.. పనిచేసే ముఖ్యమంత్రిని

మొదటిపేజీ తరువాయి

మండిపడ్డారు. మన రాష్ట్రానికి రావాల్సిన వాటి కోసం ఎన్నిసార్లు ఢిల్లీకి వెళ్లడానికైనా తాను సిద్ధమని అన్నారు. తాను ఫామ్ హౌస్ సీఎం కాదని... పనిచేసే సీఎంనని చెప్పారు.

**ప్రజల ఆలోచనే మా ఆచరణ..**

తెలంగాణ భౌగోళిక స్వరూపం బిగించిన పిడికిలి మాదిరిగా ఉంటుంది. ఆ పిడికిలి పోరాటానికి సంకేతమన్నారు. తెలంగాణలో అన్ని జాతులు, కులాలు, మతాలు కలిసికట్టుగా ఉంటాయన్న సందేశం అందులో ఇమిడి ఉందని.. ఈ ఐక్యతను, ఈ సమైక్యతను దెబ్బతీసే విధంగా సెప్టెంబర్ 17ను కొందరు వివాదాస్పదం చేయడం మంచిది కాదన్నారు. ఎందరో మహనీయుల త్యాగఫలం మన తెలంగాణ. పరిపాలనలో, ప్రతి నిర్ణయం సందర్భంలో వారి త్యాగాలు మాకు గుర్తుంటాయి. నాలుగు కోట్ల ప్రజల సంక్షేమమే గీటురాయిగా పాలన ఉంటుంది. తెలంగాణ ప్రజలే ఈ రాష్ట్ర ప్రస్థానానికి నావికులు. వారి ఆలోచనలే మా ఆచరణ. వారి ఆకాంక్షలే మా కార్యాచరణ" అని సీఎం చెప్పారు. జయ జయహే తెలంగాణ గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా, సంక్షిప్త నామాన్ని టీజీగా మార్చడం, సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ, గద్దర్ పేరిట అవార్డులు, మహిళా విశ్వవిద్యాలయానికి చాకలి ఐలమ్మ పేరును ఖరారు చేయడం వంటి తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనానికి చేపట్టిన అనేక చర్యలను ఈ సందర్భంగా రేవంత్ గుర్తు చేశారు.





## రైతు కూలీలకు ఏటా రూ.12,000

మొదటిపేజీ తరవాయి

కోసం ఏర్పడిందే ఈ ప్రజాపాలన ప్రభుత్వం అన్నారు. భారత రాజ్యాంగం మేరకు ప్రజాపాలన నడుస్తుందన్నారు. ప్రజాస్వామ్యాని గౌరవించే ప్రతి ఒక్కరు ప్రజాపాలనను స్వాగతించాలని కోరారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కుదేలైందని, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితి చూశామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. అలాంటి పాలనా నుంచి నేడు విముక్తి పొందామన్నారు. ప్రజాపాలనలో అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామన్నారు. రైతులకు పంట బీమా, వ్యక్తిగత ఇన్సూరెన్స్ కల్పిస్తున్నామన్నారు. దీంతో పాటు సోలార్ పంపు సెట్లతో ఆదాయం వచ్చేలా ప్రణాళికలు వేస్తున్నామన్నారు. అలాగే భూమిలేని రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేలు చొప్పున ఇచ్చే ఆలోచన చేస్తున్నామన్నారు. ఐకేపీ ద్వారా మహిళలు ఆర్గానిక్ ఫార్మిగ్ చేసేలా కృషి చేస్తున్నామన్నారు. పక్కదారి పట్టిన దళిత బంధు యూనిట్లు తిరిగి అమల్లోకి తెచ్చే బాధ్యత అధికారులదే అన్నారు.

**సన్న వడ్లకు రూ.500 బోనస్**

ఈ ఖరీఫ్ నుంచి సన్నాలకు రూ.500 బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది. ఇది విప్లవాత్మక నిర్ణయమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ఖరీఫ్ నుంచి సన్నాలకు 500 రూపాయల బోనస్ అందించనున్నట్లు మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఈ ఖరీఫ్ నుంచే సన్నాలకు (సన్న రకం ధాన్యం) 500 రూపాయల బోనస్ ను చెల్లించనున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సన్న వడ్లకు వానాకాలం నుంచి క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామని మంత్రి ఉత్తమ్ ప్రకటించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ నిలబెట్టుకుంటుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నేతలు రైతులకు హామీలు ఇచ్చారు. వీటిల్లో రూ.2 లక్షల రైతు రుణ మాఫీ, వరి పంటకు రూ.500 బోనస్. తాజాగా బోనస్ పై ప్రభుత్వం ప్రకటన చేసింది.



## రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య దిశగా ప్రజాపాలన

- కలెక్టరేట్ లో జాతీయ జెండాను ఆవిష్కరించిన శాసనసభాపతి
- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**వారధి న్యూస్, వికారాబాద్:** మంగళవారం కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించి, తెలంగాణ గీతాలాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ అభివృద్ధికి ముందుకు సాగడం, ప్రాధాన్యత రంగాల్లో ప్రపంచంతో పోటీపడడం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం ఇచ్చిన హామీల మేరకు అనేక కార్యక్రమాలు చేపట్టామని, గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి లబ్ధిదారుల నుండి దరఖాస్తులను స్వీకరించడం జరుగుతుందని వెల్లడించారు. మహాలక్ష్మి పథకం కింద 1 కోటి 79 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని పొందారని, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్ అందించే దిశగా 1 లక్షా 20 లబ్ధిదారులను గుర్తించి 1 కోటి 73 లక్షల రూపాయల గ్యాస్ సబ్సిడీ అందించడం జరిగిందని తెలిపారు.

సుస్థిర అభివృద్ధికి జిల్లా వృద్ధి పథంలో కొనసాగుతుందని, అందరి సహకారం అవసరం అని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్, సుధీర్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతి, శాసనసభ్యులు టి.రామ్మోహన్ రెడ్డి, బి. మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## ఢిల్లీ కొత్త సీఎంగా అతిశీ

- రాజీనామా చేసిన కేజ్రీవాల్
- వారం రోజుల్లో కొత్త సీఎం ప్రమాణస్వీకారం
- ఆపద్ధర్మ సీఎంగా కొనసాగనున్న కేజ్రీవాల్

**వారధి న్యూస్, న్యూఢిల్లీ:**

ఢిల్లీ కొత్త సీఎంగా ఆమ్ ఆద్మీ పార్టీ నేత, రాష్ట్ర జలవనరుల, విద్యాశాఖా మంత్రి అతిశి మర్లీనా బాధ్యతలు స్వీకరించబోతున్నారు. ఈ మేరకు ఆప్ వర్గాలు వెల్లడించాయి. మంగళవారం జరిగిన పార్టీ సమావేశంలో ప్రస్తుత ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ స్వయంగా సీఎం పదవి కోసం అతిశీ పేరును నామినేట్ చేసినట్లు తెలుస్తోంది. కాగా.. ఢిల్లీ సీఎంగా బాధ్యతలు స్వీకరించనున్న మూడవ మహిళా ముఖ్యమంత్రిగా అతిశీ రికార్డులకెక్కనున్నారు. ఇంతకు ముందు సుష్మా స్వరాజ్, షీలా దీక్షిత్ ఢిల్లీ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. ఇదిలా ఉంటే మద్యం కుంభకోణంలో అరెస్టై ఈ మధ్యనే జైలు నుంచి బెయిల్‌పై బయటకొచ్చిన కేజ్రీవాల్.. తన సీఎం పదవికి రాజీనామా చేస్తానంటూ ప్రకటించడంతో కొత్త సీఎం ఎవరనే ప్రశ్న తెరపైకొచ్చింది. అయితే తాజాగా అతిశీని సీఎంగా నియమించబోతున్నట్లు కేజ్రీవాల్ నిర్ణయం తీసుకోవడంతో ఆ టెన్షన్‌కు తెర పడింది.

ఆపద్ధర్మ సీఎంగా అరవింద్ కేజ్రీవాల్

ఢిల్లీ ముఖ్యమంత్రి పదవికి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేశారు. లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాను కలిసి రాజీనామా లేఖను అందజేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ శాసన సభాపక్ష నేతగా అతిశీని ఎంపిక చేశామని ఎల్జీకి వివరించారు. వారం రోజుల్లో అతిశీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. అప్పటివరకు అరవింద్ కేజ్రీవాల్ ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తారు.

## 'బుల్డోజర్ న్యాయం' ఆపండి

మొదటిపేజీ తరవాయి

వివిధ రాష్ట్రాలు విచారణలో ఉన్న నేరగాళ్ల ఇళ్లు, ప్రైవేట్ ఆస్తులపైకి బుల్డోజర్లను నడిపించే విషయంలో బాధితులకు ఉపశమనం ఇవ్వడం, మార్గదర్శకాలపై విచారణ చేపట్టింది. జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని బెంచ్.. అనధికారికంగా జరిపే ఇలాంటి బుల్డోజర్ చర్యలను అక్టోబర్ 1 వరకూ నిలిపేయాలని పేర్కొంది. ఈ విధానాన్ని చాలా గొప్పగా చిత్రీకరించే తీరును సర్వోన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. మరోవైపు, వీటిని ఆపితే ఆక్రమణల తొలగింపు ఆలస్యమవుతుందన్న ప్రభుత్వ భయాలను కొట్టిపారేసింది. 'వచ్చే విచారణ తేదీ వరకూ మీ చర్యలను ఆపాలని మేం కోరినంత మాత్రాన కొంపలేం మునిగిపోవు.' అని జస్టిస్ బి.ఆర్.గవాయ్, కె.వి.విశ్వనాథన్ వ్యాఖ్యానించారు. కాగా, ఈ నెలలో వివిధ రాష్ట్రాలు రెండు సార్లు చేపట్టిన 'బుల్డోజర్ న్యాయం'పై న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది.

**వీటికి ఆదేశాలు వర్తించవు**

అదే సమయంలో బహిరంగ స్థలాలు, రైల్వే ఆస్తులు, నీటి వనరుల ఆక్రమణల తొలగింపు విషయంలో ఈ ఆదేశాలు వర్తించవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. 'బుల్డోజర్ న్యాయం'ను హీరోయిజంగా చూపే యత్నం చేయవద్దని హెచ్చరించింది. ఈ వ్యవహారానికి సంబంధించి ఎన్నికల సంఘానికి సైతం నోటీసులు జారీ చేస్తామని సుప్రీంకోర్టు వెల్లడించింది. మహారాష్ట్ర, ఝార్ఖండ్, జమ్మూకశ్మీర్, హరియాణాల్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో ఈసీకి నోటీసులు ఇస్తామనడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసులో




ప్రధాన పిటిషనర్‌గా జామత్ ఉలేమా హింద్ వ్యవహరిస్తోంది. కూల్చివేతలకు ముందు కనీసం 40 60 రోజుల ముందుగా నోటీసులు జారీ చేయాలని.. చట్ట వ్యతిరేక కూల్చివేతలకు సదరు అధికారులను బాధ్యులను చేయాలని సుప్రీంకు నివేదించింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది దుష్యంత్ దవే, సీయూ సింగ్ వాదనలు వినిపించారు. ఇప్పటికే సెప్టెంబర్ 2వ తేదీన జరిగిన వాదనల్లో దేశంలో ఎక్కడా ఈ తరహా చర్యల్లో మార్గదర్శకాలను పాటించడం లేదని పేర్కొన్నారు. అటు, యూపీ ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఈ వాదనలు విన్న సర్వోన్నత న్యాయస్థానం 'బుల్డోజర్ న్యాయం'పై అక్టోబర్ 1 వరకూ స్టే విధించింది.

## త్రివిక్రమ్ శ్రీనివాస్‌ను ప్రశ్నించండి

- గతంలో ఫిర్యాదు ఇచ్చినా పట్టించుకోలేదు
- ట్విట్టర్ వేదికగా పూనం కౌర్ ఆగ్రహం
- సీఎంతో చర్చించి జానీ మాస్టర్‌పై చర్యలు
- మీడియాకు వెల్లడించిన ఫిలిం చాంబర్ సభ్యులు

**వారధి, స్టేట్ బ్యూరో:**



టాలీవుడ్ స్టార్ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ పై మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసింది సినీ నటి పూనం కౌర్. ఇప్పటికే సోషల్ మీడియా వేదికగా త్రివిక్రమ్‌పై పలుసార్లు సంచలన వ్యాఖ్యలు చేసిన పూనం కౌర్ మరోసారి విరుచుకుపడింది. టాలీవుడ్‌లో ప్రస్తుతం జానీ మాస్టర్ లైంగిక వేధింపుల ఆరోపణలు హాట్ టాపిక్ అవుతున్న నేపథ్యంలో జానీని మాస్టర్ అని పిలవకండి అలా పిలవాలంటే కనీసం గౌరవం ఉండాలి అంటూ చెప్పుకోచ్చింది. ఈ క్రమంలోనే తాను త్రివిక్రమ్ శ్రీనివాస్‌పై ఇచ్చిన కంప్లయిట్‌ను తీసుకున్నారా అంటూ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌ను ప్రశ్నించింది. నాలాంటి వాళ్లకి పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్ లేకపోవచ్చు. అందుకే నన్ను సైలెంట్ గా పక్కనబెట్టేశారు. నేను అప్పుడు మా అసోసియేషన్‌లో ఉన్న పెద్దవాళ్లకి కంప్లయింట్ చేశాను. ఇప్పుడైన ఇండస్ట్రీ పెద్దలు ఈ విషయంపై త్రివిక్రమ్‌ను ప్రశ్నించాలని కోరుతున్నాను అంటూ పూనం రాసుకోచ్చింది. అంతకుముందు కూడా త్రివిక్రమ్‌పై సంచలన వ్యాఖ్యలు చేసింది ఈ భామ. త్రివిక్రమ్ ఎలాంటి వాడో, ఆయన చెడు స్వభావం ఎంటో నాకు తెలుసు. మగవారి ఇగో కోసం ఆయన సపోర్ట్ చేస్తారని కూడా తెలుసు. నీవు నీ అనుభవంతో మాట్లాడుతుంటే.. నేను నా అనుభవంతో మాట్లాడుతున్నాను. ఇతరుల జీవితాలను త్రివిక్రమ్ నాశనం చేస్తారు. ఒకసారి త్రివిక్రమ్ దగ్గరకు వెళ్లి తనకు ఆయన ఏం చేశాడో, వేరే వాళ్ల చేత ఏం చేయించాడో ఆయన్నే అడగండని మరోసారి ఫైర్ అయింది.

**సీఎంతో చర్చించి జానీ మాస్టర్‌పై కఠిన చర్యలు**

ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ తనను లైంగికంగా వేధించాడని అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ మధ్యప్రదేశ్ కు చెందిన యువతి చేసిన ఆరోపణలపై తెలుగు ఫిలిం చాంబర్ అధికారికంగా స్పందించింది. తాజాగా ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ మీడియా సమావేశం నిర్వహించింది. తమ్మారెడ్డి భరద్వాజ, ఝాన్సీ, ఫిలిం చాంబర్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. జానీ మాస్టర్ మీద ఆరోపణలు రావడంతో ఈ వివాదం తేలే వరకు అతన్ని డ్యాన్సర్ అసోసియేషన్ అధ్యక్ష పదవి నుంచి తప్పించాలని ఫెడరేషన్ ను ఇప్పటికే ఆదేశించామని వారు తెలిపారు. ఐదేళ్ల పాటు ఆ అమ్మాయి నరకం చూసిందని.. యువతి తల్లిదండ్రుల నుంచి కూడా సమాచారం సేకరించామని.. దీనిపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి జానీపై కఠిన చర్యలు తీసుకుంటామని వారు స్పష్టం చేశారు. చిత్ర పరిశ్రమలో లైంగిక వేధింపుల గురించి యాంకర్, నటి ఝాన్సీ స్పందించారు. మన ఇండస్ట్రీలో మహిళా రక్షణ కోసం సరైన గైడ్ లైన్స్ లేవన్నారు. నటి శ్రీ రెడ్డి ఇష్యూ తరువాత ఒక కమిటీ ఫామ్ అయిందని, జానీ మాస్టర్ ఇష్యూ తెరపైకి వచ్చిన వెంటనే ఆ కమిటీ వారు పరిశీలన చేస్తున్నారని, ఈ వివాదంలో బాధితురాలు తొలుత తన వర్క్ పరంగా ఇబ్బంది అని ముందుకు వచ్చిందని, ఆ తర్వాత లైంగిక వేధింపులు కూడా ఉన్నాయని ఫిర్యాదు చేసిందని ఝాన్సీ పేర్కొన్నారు. ఆ అమ్మాయి స్టేట్మెంట్ తో పాటు జానీ మాటలను కూడా రికార్డు చేశామని, అయితే, లైంగిక వేధింపులు అనేది వర్క్ లోకేషన్ లో జరగలేదని, ఆ అమ్మాయి ఇప్పటికే లీగల్ గా ముందుకు వెళ్తుందని చెప్పారు.

## హైడ్రాపై తగ్గేదేలే

- ఎంత పెద్దవారైనా వదిలిపెట్టం
- ఎన్ని విమర్శలొచ్చినా కూల్చివేతలు ఆపం
- దీని వెనక ఎలాంటి రాజకీయ ఉద్దేశాల్లేవు
- సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు

**వారధి, స్టేట్ బ్యూరో:**

చెరువులు, కుంటలలో అక్రమంగా నిర్మించిన భవనాలను కూల్చివేసే విషయంలో వెనక్కి తగ్గేదే లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైడ్రాపై ఎన్ని విమర్శలు వచ్చినా ముందుకే వెళతామని వివరించారు. ప్రతిపక్ష నేతలు చేస్తున్న విమర్శలను ఆయన కొట్టిపారేశారు. హైడ్రా ఏర్పాటు, కూల్చివేతల వెనక ఎలాంటి రాజకీయ ఉద్దేశాలు తమకు లేవని తేల్చిచెప్పారు. ఈమేరకు తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌లలో కట్టిన బిల్డింగ్‌లు ఎంతపెద్ద వారివైనా వదిలిపెట్టబోమని రేవంత్ రెడ్డి మరోమారు స్పష్టం చేశారు. ఈ విషయానికి సంబంధించి హైడ్రా ఇప్పటికే పలువురు ఆక్రమణదారులకు, బడాబాబులకు నోటీసులు ఇచ్చిందని గుర్తుచేశారు. హైడ్రా పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన సీఎం... అధికారుల పనిలో తమ జోక్యం ఉండదని వివరించారు. కాగా, ఎఫ్ టీఎల్ పరిధిలోని నిర్మాణాలకు సంబంధించిన యజమానులకు హైడ్రా నోటీసులు పంపించింది. వెంటనే వాటిని కూల్చేయాలని హెచ్చరించింది. లేదంటే తామే రంగంలోకి దిగి వాటిని కూల్చేస్తామని అధికారులు స్పష్టం చేశారు.

వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com





## ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల రక్షణకు ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకోవాలి

- బిఎస్ఎఫ్

**వారధి న్యూస్, బిజినపల్లి:** బిజినపల్లి మండల కేంద్రంలోని మేదాన్స్ స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థి సురేందర్‌పై జరిగిన దాడి ఘటనపై బహుజన విద్యార్థి సమాఖ్య (బిఎస్ఎఫ్) మరియు బహుజన సమాజ్ పార్టీ (బిఎస్పీ) ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. బిఎస్ఎఫ్ సభ్యులు పాఠశాల యాజమాన్యాన్ని విద్యార్థిని ఎందుకు దారుణంగా కొట్టారని ప్రశ్నించారు.
అంబేద్కర్ చౌరస్తాలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో బిఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, బిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సాయిబాబా, బిఎస్పీ మండల అధ్యక్షుడు రాంచందర్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల రక్షణ కరువైందని, ఫీజులు కట్టలేదని, హోం వర్క్ చేయలేదని లేదా టీచర్ల మాట వినలేదని విద్యార్థులను ఇష్టం వచ్చినట్లు కొట్టడం అనైతికమని విమర్శించారు. వారు ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల రక్షణకు చర్యలు తీసుకోవాలని, విద్యా కమీషన్ దీనిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. విద్యా శాఖ అధికారులు ప్రైవేటు పాఠశాలలను నిరంతరం పర్యవేక్షించాలి, దాడికి గురైన విద్యార్థికి తగిన వైద్యం అందించాలి, అలాగే దాడికి పాల్పడిన టీచర్‌పై కేసు నమోదు చేయాలని వారు కోరారు .ఈ నిరసన కార్యక్రమంలో బిఎస్పీ జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్, నాగర్ కర్నూల్ అసెంబ్లీ బిఎస్పీ ఉపాధ్యక్షుడు పరుశరామ్, ప్రధాన కార్యదర్శి కళ్యాణ్, బిజినపల్లి మండల ప్రధాన కార్యదర్శి శివకృష్ణ, తిమ్మాజీపేట్ మండల అధ్యక్షుడు రాజు, మరియు నాయకులు రాములు, శ్రీను, మల్లేష్, మొఘులాల్, బాలు, చంద్రశేఖర్, చందు తదితరులు పాల్గొన్నారు.



## చిలకలగూడ పోలీస్ స్టేషన్ లో 9 రోజులు విశేష పూజలు అందుకున్న గణనాథుడు

- బ్యాండ్,భాజాలతో బయలుదేరి నిమజ్జనం చేసిన పోలీసులు, ఉత్సవ సమితి

**వారధి న్యూస్ హైదరాబాద్ :** భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సికింద్రబాద్ కన్వీనర్ ఏ.ఎస్. భాస్కర్ గిరి ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం చిలుకలగుడ పోలీసు స్టేషన్ లో ప్రతిష్టించిన ఘననాథుడికి పూజలు ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది . ఈ సంవత్సరం కూడా ఏర్పాటు చేసిన గణపతి నవరాత్రి ఉత్సవాలలో ఏసిపి జైపాల్ రెడ్డి , సీఐ అనుదీప్ తో పాటు సిబ్బంది గణపతి పూజలో ప్రతిరోజు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు . ఇలా పోలీస్ స్టేషన్ లో గణనాథుని పూజలు చేయడం తో చిలకలగూడ పోలీస్ స్టేషన్ లో ఒక్క పండుగ వాతావరణం ఏర్పడింది అని తెలిపారు . పూజా కార్యక్రమనికి ముఖ్య అతిథిలుగా చిలుకలగూడ ఏసిపి జైపాల్ రెడ్డి, సీఐ అనుదీప్ తో పాటు ఉత్సవ సమితి నాయకులు హాజరయ్యారు. మంగళవారం 9 రోజు కావడంతో బ్యాండ్, భజాలతో మహా గణపతిని స్వయంగా తీసుకొని చిలకలగూడ గ్రౌండ్ మినీ పాడ్ లో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో అశ్విన్, కుమార్, తరుణ్, గుణ, వెంకటేష్ పాల్గొన్నారు.



## గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం

- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**వారధి న్యూస్, నాగర్ కర్నూలు జిల్లా బ్యూరో** గ్రామ పంచాయతి సాధారణ ఎన్నికలు, గ్రామ పంచాయతి ఓటర్ల జాబితా తయారు చేసి ప్రచురించుట అన్ని రాజకీయ పార్టీ ప్రతినిదులతో ఈనెల 18వ తేదీ బుధవారము మధ్యాహ్నం 3:00 గంటలకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతీనిధులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ బాధావత్ సంతోష్ మంగళవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమీషనర్, హైదరాబాద్ వారు 2వ సాధారణ ఎన్నికల కొరకు ఓటర్ల జాబితా తయారు చేసి ప్రచురించుటకై పై సూచన ద్వారా షెడ్యూల్ విడదల చేస్తూ, జిల్లాలోని గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో చర్చించేందుకు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సమావేశానికి గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలని ప్రకటనలో కలెక్టర్ కోరారు.



## ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

**వారధి న్యూస్ పెబ్బేరు:** పెబ్బేర్ పట్టణంలో బ్రహ్మంగారి దేవాలయంలో విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయంలో విశ్వకర్మ చిత్ర పటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి హోమ యాగాలను నిర్వచించారు. పట్టణంలో విశ్వకర్మలు బైక్ ర్యాలీని నిర్వహించారు. అనంతరం ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు







# గాంధీ ఆసుపత్రిలో ప్రజా పాలన దినోత్సవ వేడుకలు

**వారధి న్యూస్ హైదరాబాద్ :** తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం వేడుకలు గాంధీ ఆసుపత్రిలో మెన్ బిల్డింగ్ వద్ద హాస్పిటల్ సూపర్డెంట్ ప్రొఫెసర్ డా.రాజకుమారి జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ ప్రజా పాలన కార్యక్రమంలో డిప్యూటీ సూపర్డెంట్ కే. సునీల్ కుమార్, ఆర్ ఎం ఓ -1 డాక్టర్ శేషాద్రి, హెచ్ ఓ డి లు, డాక్టర్లు,నర్సింగ్స్, మినిస్ట్రియల్ ఉద్యోగులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.







## నాగర్ కర్నూల్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో మొదటి స్థానంలో ఉంది

- ఘనంగా ప్రజా పాలన దినోత్సవం
- జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి. చిన్నారెడ్డి

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** నాగర్ కర్నూల్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో మొదటి స్థానంలో ఉందని ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఆయన జాతీయ జెండాను ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం ఎంతో ఉందని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, జి. చిన్నారెడ్డి, అన్నారు. మంగళవారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం, నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత జిల్లా అధికారుల కార్యాలయం సముదాయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, జి. చిన్నారెడ్డి, జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమానికి ముందు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు, జి. చిన్నారెడ్డి, తెలంగాణ తల్లి, జాతిపిత మహాత్మాగాంధీ, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, సర్దార్ వల్లభాయ్ పటేల్ ల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, డీఎఫ్ఓ రోహిత్ గోపిడి, జిల్లా అదనపు కలెక్టర్ దేవ సహాయం, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, ఆయా శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## నల్లమల్ల గిరి పుత్రుల మధ్యన ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** జిల్లాలోనిఅమ్రాబాద్ మండలం నల్లమల అడవి ప్రాంతం కొమ్మనపెంటలో ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం సందర్భంగా భారతీయ జనతా పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగిశెట్టి నాగరాజు, మండల అధ్యక్షుడు గోలి రాజు ఆధ్వర్యంలో కోమ్మనపెంటలో చెంచు సోదరుల కుటుంబాల మధ్యన వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ భారత రాష్ట్రపతి ద్రౌపతి ముర్మ ఒక గిరి పుత్రిక కాబట్టి ఆ గిరిజన కుటుంబాల మధ్యనే భారత ప్రధాని జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఉన్నటువంటి గిరిజన కుటుంబాలకి చీరలు బియ్యం పళ్ళు మరియు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా గతంలో నరేంద్ర మోడీ కాన్ఫిడెన్స్ కాల్ లో మన్ననూరు లో చెంచు కుటుంబాల తో మాట్లాడిన విషయాన్ని అక్కడ ఉన్న చెంచులు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నోముల శంకర్ గౌడ్, నోముల శ్రీను గౌడ్, గోలి శివ కుమార్, సతీష్ కుమార్, పరమేష్, మడ్డి వంశీ గౌడ్, రమేష్, ప్రమోద్, నిరంజన్ ఎల్లమ్మ వెంకటయ్య, సొరమ్ ఈదయ్య పాల్గొన్నారు



## నాగరికతకు మూలపురుషుడు విరాట్ విశ్వకర్మ

- జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి ఖాజా నాజీమ్ అలీ అప్సర్

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** నాగరికతకు మూలపురుషుడు విరాట్ విశ్వకర్మ ఆయనను ఆదర్శంగా తీసుకుని ప్రతీ ఒక్కరు సన్మార్గంలో నడవాలని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఖాజా నాజీమ్ అలీ అప్సర్ సూచించారు. మంగళవారం నాగర్ కర్నూల్ సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సృష్టికి ముందే విరాట్ విశ్వకర్మ జన్మించారని, సమాజానికి అవసరమైన వివిధ వృత్తులను ఆయన సృష్టించారని ఆయన తెలిపారు.విశ్వాన్ని మలచిన సృష్టికర్తగా విశ్వకర్మను పూజిస్తామని, సకల కళలకు, సృజనాత్మకతకు అధినేత, మానవ మనుగడకు అవసరమైన రకరకాల వృత్తులకు ఆద్యుడు, నాగరికతకు మూలపురుషుడు విశ్వకర్మ అని కొనియాడారు.కమ్మరి, వడ్ల, స్వర్ణకా ర, శిల్ప, కంచరి వంటి వివిధ వృత్తులను సృష్టించి సమాజానికి అవసరమైన వస్తువులను తయారు చేసుకునేందుకు ఆయన చేసిన సేవల పట్ల విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం హర్షణీయమని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో అద నపు కలెక్టర్ వేణుగోపాల్, బీసీ సంక్షేమ సహాయ అధికారి బీరం సుబ్బారెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బం ది తదితరులు పాల్గొన్నారు.




## తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తున్న బిజెపి

- జిల్లా కార్యదర్శి వి పర్వతాలు

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారసత్వాన్ని వక్రీకరించి ప్రజల మధ్య చీలికలు తెస్తున్న బిజెపి విధానాలను తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తితో తిప్పి కొట్టాలని సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. మంగళవారం సిపిఎం పార్టీ బల్మూరు గ్రామ మహాసభ జరిగింది. మహాసభ ముందు పార్టీ జెండాను సిపిఎం పార్టీ గ్రామ కార్యదర్శి ఆంజనేయులు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సిపిఎం గ్రామసభ కామ్రేడ్ ఎండి లాల్ మహమ్మద్ అధ్యక్షతన జరిగింది. ముందుగా సిపిఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలదండ వేసి నివాళి అర్పించారు. అనంతరం మహాసభకు ముఖ్యఅతిథిగా పార్టీ జిల్లా కార్యదర్శి వి పర్వతాలు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటం భూమికోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో నైజాం రజాకార్లకు వ్యతిరేకంగా ప్రజలంతా పోరాడారని తెలిపారు పాలకుర్తి గ్రామంలో చుట్టుపక్కల ప్రజలను చైతన్య పరిచి అరాచకాలను తిప్పి కొట్టడానికి ధైర్యంతో ముందుకెళ్ళిన వీరనారి చిట్యాల ఐలమ్మ ధీరత్వం నేటి తరానికి స్ఫూర్తి దాయమని వారు అన్నారు తెలంగాణ సాయుధ పోరాటానికి కమ్యూనిస్టులే నిజమైన వారసులు అన్నారు మతోన్మాద బిజెపి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోరాటాన్ని హిందూ ముస్లిం పంచాయతీలాగా మారుస్తున్నారని అన్నారు. చరిత్రను ఒకరీకరిస్తే ప్రజలు క్షమించారని కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలపై భారాలు వేయడానికి ప్రయత్నం చేస్తుందని ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మివేయాలని మోడీ చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలని అన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దేశా నాయక్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని తెలిపారు రైతుబంధు వేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని అన్నారు ఎస్సీ ఎస్టీ మైనార్టీ బీసీ డిక్లరేషన్ అమ్ములు గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఆసరా పెన్షన్ పెంచుతామని హామీ ఇచ్చి పది నెలలు అయినా పెంచడం లేదన్నారు రాష్ట్రంలో మైనార్టీలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు దళిత గిరిజన మహిళలపై లైంగిక దాడులు వేధింపులు పెరుగుతున్నాయని అన్నారు . ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. నవంబర్ 24 25 తేదీల్లో జరిగే జిల్లా మహాసభలు అచ్చంపేట పట్టణంలో నిర్వహించనున్నామని ఈ మహాసభ నిర్వహణ కోసం ప్రజలు వ్యాపారస్తులు పట్టణ ప్రముఖులు ఆర్థిక హర్తిక సహకారాలు అందించాలని కోరారు ఈ మహాసభలో పార్టీ బల్మూరు మండల కార్యదర్శి మూడవత్ శంకర్ నాయక్, మండల నాయకులు ఆంజనేయులు, బాలయ్య మధు జహంగీర్ బాబర్ వెంకటయ్య, రజియా బేగం, బాబి బేగం సల్మా బేగం, అరుణ మాసయ్య తదితరులు పాల్గొన్నారు



## ఎన్టీఆర్ కళాశాలలో ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** ప్రజా పాలన దినోత్సవాన్ని ఎన్టీఆర్ కళాశాలలో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా, నిరంకుశ పాలన నుండి ప్రజాస్వామ్యంలోకి రావడం మరవలేని ఘట్టమని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వ ఎన్టీఆర్ మహిళ డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాల ప్రాంగణంలో, ఎన్సీసీ క్యాడెట్స్ ఆధ్వర్యంలో జాతీయ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రసంగించిన ప్రిన్సిపల్ రాజేంద్ర ప్రసాద్, సెప్టెంబర్ 17న ప్రజా పాలన దినోత్సవం జరపడం ఒక పోరాట సంకేతం అని, యావత్ రాష్ట్రం ఈ రోజును ఒక పునరంకిత భావంతో జరుపుకుంటోందని తెలిపారు. నిరంకుశ పాలన నుండి ప్రజాస్వామ్యంలోకి అడుగు పెట్టిన సమయంలో, ప్రభుత్వ విధానాలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు మార్గదర్శకంగా ఉంటాయని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పద్మ అనురాధ, బోధన మరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థినులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని పరామర్శించిన ఐజెయు నేతలు

- మాజీ మంత్రి సి లక్ష్మారెడ్డిని టి యు డబ్ల్యూ జే (ఐజేయు)

**వారధి న్యూస్, మహబూబ్ నగర్ :** మహబూబ్నగర్ జిల్లా అధ్యక్షుడు దండు దతేందర్, ప్రధాన కార్యదర్శి బి జి రామాంజనేయులు, నాయకులు మణి ప్రసాద్, గురు ప్రసాద్, సతీష్ రెడ్డి కలిసి పరామర్శించారు. లక్ష్మారెడ్డి సతీమణి శ్వేతా రెడ్డి అకాలమరణంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తమ ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. శ్వేతా రెడ్డి చిత్రపటం వద్ద పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

# అమరుల త్యాగ ఫలితమే తెలంగాణ

- **తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం**




**వారధి న్యూస్, మహబూబ్ నగర్:**తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు గవినోళ్ళ రాజీవ్ రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ పోరాటం మరియు తొలి తెలంగాణ సాధన పోరాట స్ఫూర్తితోనే మలిదశ తెలంగాణ ఉద్యమం సాగిందని, ఈ పోరాట ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని చెప్పారు.1960 దశకంలో జరిగిన తొలి పోరాటంలో 360 మంది త్యాగధనులు తమ ప్రాణాలను అర్పించారని, అలాగే మలిదశ తెలంగాణ ఉద్యమంలో 1200 మంది అమరుల త్యాగ ఫలితమే ఈ రాష్ట్రం ఏర్పడిందని పేర్కొన్నారు.ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాతులవత్ చంద్రా నాయక్, జిల్లా కోశాధికారి డాక్టర్ పొనకంటి కృష్ణమోహన్, జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాంరెడ్డి, జాయింట్ సెక్రెటరీ ప్రియాంక, పట్టణ కార్యదర్శి కృష్ణ కుమార్ గౌడ్, అసోసియేట్ అధ్యక్షులు అనిల్ కుమార్, కోశాధికారి చాంద్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నందకిషోర్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా ప్రజా పరిపాలన దినోత్సవం



**వారధి న్యూస్, మహబూబ్ నగర్:**ప్రజా పాలన దినోత్సవం 2024 సందర్భంగా మహబూబ్ నగర్ జిల్లా పోలీస్ కార్యాలయాలలో జాతీయ పతాకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. జోగులాంబ జోన్ 7 డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్, ఐపీఎస్, తన కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేసారు, అలాగే జిల్లా ఎస్పీ శ్రీమతి డి. జానకి, ఐపీఎస్, జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం ప్రతి ఏడాది సెప్టెంబర్ 17న తెలంగాణ రాష్ట్రంలో ప్రజల గౌరవానికి మరియు స్వతంత్ర భారతదేశంలో హైదరాబాదు సంస్థానం విలీనమైన దినోత్సవంగా జరుపుకుంటారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రాములు, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఎస్ బి ఇన్స్పెక్టర్ శివ కుమార్, ఆర్ ఐ లు కృష్ణయ్య, నగేష్, మరియు ఇతర పోలీసులు పాల్గొన్నారు.




# సెప్టెంబర్ 23న చలో సంక్షేమ భవన్

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** రాష్ట్రంలోని సంక్షేమ హాస్టల్ విద్యార్థుల మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ, సెప్టెంబర్ 23న హైదరాబాదులోని సంక్షేమ భవన్ వద్ద నిర్వహించే ధర్నా పోస్టర్ను సిఐటియు కార్యాలయం దగ్గర ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ఎం. మాణిక్యం రాజు, కార్యదర్శి ఎం. కురుమయ్య మాట్లాడుతూ, గత పది సంవత్సరాలుగా హాస్టల్ మెస్ చార్జీలు పెరగకపోవడం వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని, 23 సంవత్సరాలుగా కాస్మోటిక్ చార్జీలు పెరగకపోవడం వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారు డిమాండ్ చేస్తూ, మెస్ చార్జీలను 2000 రూపాయల వరకు, కాస్మోటిక్ చార్జీలను 300 రూపాయల వరకు పెంచాలని, అలాగే కాలేజీ విద్యార్థులకు మూడు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న పాకెట్ మనీని విడుదల చేసి, దాన్ని 1000 రూపాయలకు పెంచాలని కోరారు. రాష్ట్రంలో 55 హాస్టల్ భవనాలు అద్దె భవనాల్లో నడుస్తుండగా, వాటికి సొంత భవనాలు నిర్మించాలనివారు తెలిపారు.





# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

- **సూపర్ డీలక్స్, మోటర్ సైకిల్**
- **రోడ్డు ప్రమాదంలో ఒకే గ్రామానికీ చెందిన వారు**
- **రంగాపూర్ లో అలుముకొన విషాదం**

**వారధి న్యూస్ పెబ్బేరు:** పెబ్బేరు మండలం రంగాపురం పోగాకు కంపెనీ వద్ద జాతీయ రహదారిపై ఘోర రోడ్డు ప్రమాదం ఇద్దరు మృతి చెందినట్లు ఎస్ ఐ హరిప్రసాద్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ నుండి కర్నూల్ వైపు వెలుచున్న టీఎస్ ఆర్టీసీ సూపర్ డీలక్స్ బస్ టి ఎస్ 09 జెడ్ 7824, మోటర్ సైకిల్ డికోవడంతో రంగాపురం గ్రామానికి చెందిన పెండ్లి రాముడు (60) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మసీద్ శేఖర్ (58) తీవ్రంగా గాయపడగా హైవే అంబులెన్స్ లో వనపర్తి ప్రభుత్వాసుపత్రి చికిత్స కోసం తీసుకెళుతుండగా మార్గమధ్యలోనే చనిపోయిన్నట్లు అయన తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను జిల్లా ప్రధాన ఆసుపత్రి కి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. వివరాల్లోకి వెళితే హైదారాబాద్ నుంచి కర్నూల్ వెళ్తున్న టీఎస్ఆర్టీసీ సూపర్ డీలక్స్ బస్సు.. పోలం పనుల నిమిత్తం టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై గ్రామానికి చెందిన పెండ్లి రాముడు, మసీద్ శేఖర్ పొగాకు కంపేని దగ్గర క్రాస్ రోడ్డు దాటుతుండగా హైదారాబాద్ నుంచి కర్నూల్ వైపు వెళుతున్న టీఎస్ఆర్టీసీ సూపర్ డీలక్స్ బస్సు వేగంగా ఢీకొట్టింది. గ్రామంలో ఒకే కులానికి చెందిన ఇద్దరు వ్యక్తులు చనిపోవడంతో దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.






# 80 కోట్ల రూపాయలతో సమీకృత గురుకుల పాఠశాల

- **ఆహ్లాదకరమైన వాతావరణంలో కృష్ణా నది ఒడ్డున ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం**
- **రాష్ట్ర పర్యాటక ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు**

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో:** కొల్లాపూర్ నియోజకవర్గానికి 80 కోట్ల రూపాయలతో సమీకృత గురుకుల పాఠశాల(ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్)ను జటప్రోల్ లో నెలకొల్పనున్నట్లు విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన ఉచిత విద్య, వసతి అందించేందుకు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఒకే సువిశాల ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలు ఏర్పాటు చేసి.. పేద బిడ్డలకు నాణ్యమైన విద్య, వసతి సౌకర్యం కల్పించడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం అని, తద్వారా పోటీతత్వం పెరుగుతుందని, కుల, మత వివక్ష తొలగిపోతుందని మంత్రి తెలిపారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో కృష్ణా నది ఒడ్డున ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం, రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ సమీకృత పాఠశాలలను నిర్మించినట్లు మంత్రి తెలిపారు.కొల్లాపూర్ నియోజకవర్గంలోని జటప్రోలు గ్రామంలో స్కూల్ ను ఏర్పాటు చేయనున్నట్లు దానికి కావాల్సిన ప్రభుత్వ భూమిని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు పరిశీలన చేశారు .అనంతరం జటప్రోలు రైతు వేదికల వద్ద అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశానుసారం సుమారు 80 కోట్ల రూపాయలతో 4000 మంది విద్యార్థులు చదువుకునే విధంగా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను నిర్మించనున్నట్లు , ఆహ్లాదకరమైన వాతావరణం, కృష్ణానది పరివాహక ప్రాంతం, చరిత్ర ప్రశ స్త్యం ఉన్న గ్రామం కావున, ఇక్కడ నిర్మించినట్లు గ్రామస్తులకు తెలిపారు. పెంట్లవెల్లి మండల పరిధిలోని జటప్రోల్ గ్రామంలో ఇంటిగ్రేటెడ్ పాఠశాలను 20 ఎకరాల్లో నిర్మించనున్నామని పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ తమ గ్రామానికి రావడం తో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.ఒకే ప్రాంతంలో వేర్వేరుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్ గురుకుల పాఠశాలలను ఒకేచోట నిర్మిస్తామన్నారు. ఇందులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన సౌకర్యాలతో పాటు, విద్య అందిస్తామని ప్రకటించారు. ఈ పాఠశాలల వల్ల అన్నివర్గాల విద్యార్థుల మధ్య అంతరాలు తొలగిపోయి స్నేహభావం పెరుగుతుందని పేర్కొన్నారు.నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ...ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు కావలసిన స్థల సేకరణతో పాటు, అనుమతులను, సదుపాయాలను జిల్లా యంత్రాంగం తరపున కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపుకై జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా కృషి చేస్తుందన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుతో నాణ్యమైన విద్యతోపాటు విద్యార్థులకు స్నేహభావం పెంపొందేలా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పేద విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లాపూర్ ఆర్డీవో నాగరాజ్ సంబంధిత శాఖల అధికారులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



### తెలంగాణ సచివాలయంలో

# విగ్రహం వివాదంపై బీఆర్ఎస్ నిరసన

**వారధి న్యూస్, మహబూబ్ నగర్:** తెలంగాణ సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాల్సిన చోట కాంగ్రెస్ నేత రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం సరికాదని, ఇది తెలంగాణ సంప్రదాయాలకు విరుద్ధమని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ కూడలి వద్ద ఈ నిరసన కార్యక్రమం చేపట్టారు.
రాజేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారని, కానీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం దాన్ని అమలు చేయకుండా, రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం అన్యాయం అని ఆరోపించారు. రేవంత్ రెడ్డి తెలంగాణ గౌరవాన్ని కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నారని, అమరుల స్థూపం వద్ద నివాళులు అర్పించడానికి కూడా వెళ్లడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రజల మనోభావాలను దెబ్బతీసినందుకు రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ, వెంటనే రాజీవ్ గాంధీ విగ్రహాన్ని తొలగించి తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మాట్లాడుతూ, తెలంగాణ సమాజం మొత్తం ఈ చర్యను వ్యతిరేకిస్తోందని అన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, మండల అధ్యక్షులు దేవేందర్ రెడ్డి, హన్వాడ మండల అధ్యక్షులు కరుణాకర్ గౌడ్, రైతు బంధు సమన్వయకర్త కొండా లక్ష్మయ్య, సీనియర్ నాయకులు గిరిధర్ రెడ్డి, అనంతరెడ్డి, రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# వనపర్తి సెయింట్ థామస్ పాఠశాలలో విద్యార్థి మరణం అత్యంత బాధాకరం

**వారధి న్యూస్, వనపర్తి:** వనపర్తి సెయింట్ థామస్ ప్రైవేట్ పాఠశాలలో గద్వాల్ తాటి కొండ గ్రామానికి చెందిన విద్యార్థి విశాల్ మరణం తీవ్ర విచారకరమని బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు శివ నాయక్ తెలిపారు. మంగళవారం నాడు ఈ ఘటనపై శివ నాయక్ స్పందిస్తూ, పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే ఈ విషాదానికి కారణమని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజు, విద్యార్థి సంఘ నాయకులతో కలిసి పాఠశాల ప్రాంగణాన్ని సందర్శించారు. పాఠశాల వెనుక భాగంలో ఉన్న హాస్టల్, చెరువు పరిధిలో ఉన్నట్లు గుర్తించారని, హాస్టల్ నిర్మాణం బఫర్ జోన్ లో ఉందని తెలిపారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల విద్యార్థి ప్రాణం కోల్పోవడం బాధాకరమని, ఈ విషయంలో ప్రభుత్వాలు మరియు అధికారులు వెంటనే స్పందించి, పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.విద్యావ్యవస్థలో సరైన పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇలాంటి దురదృష్టకర సంఘటనలు జరుగుతున్నాయని, అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వతంత్ర అభ్యర్థి దయానంద్ ముదిరాజ్, పిడిఎస్ యూ గణేష్, వెంకటేష్, గ్రాడ్యుయేట్ అసోసియేషన్ భరత్, టిజివిపి రవి, ఎమ్ఆర్పిఎస్ చెన్న కేశవులు, ఎమ్ఎస్ఎఫ్ పరుశరామ్ తదితరులు పాల్గొన్నారు.

# సెయింట్ థామస్ స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థి మృతి

**వారధి న్యూస్, వనపర్తి:**వనపర్తి సెయింట్ థామస్ స్కూల్ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఒక విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ముందటి భాగం అందంగా కనిపిస్తున్న స్కూల్ వెనుక భాగం కాంపౌండ్ చెరువును తలపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కాంపౌండ్ వద్దే విద్యార్థులు నివసిస్తున్న హాస్టల్ ఏర్పాటు చేసినట్టు సమాచారం.యాజమాన్యం చెరువులో దూకి విద్యార్థి మరణించాడని చెబుతుండగా, సంఘాల అభిప్రాయం వేరుగా ఉంది. విద్యార్థి స్కూల్ కాంపౌండ్ దూకడం సాధ్యం కాని పరిస్థితి ఉండడంతో, అక్కడే ఉన్న నీటిలో మునిగి చనిపోయినట్లు వారు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి స్కూల్ యాజమాన్యం పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, విద్యాధికారులు సమగ్ర విచారణ జరిపించి, స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.విద్యాశాఖాధికారులు, డీఈఓ, మండల ఎం ఈ ఓ వెంటనే స్కూల్ ను సందర్శించి విచారణ చేపట్టారు. డీఈఓ మాట్లాడుతూ వారం రోజుల్లో పూర్తి విచారణ పూర్తి చేసి నివేదికను ఆర్‌జెడికు సమర్పిస్తామని, యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పీడీఎస్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బోయిన్ పల్లి గణేష్, గ్రాడ్యుయేట్ అసోసియేషన్ అధ్యక్షుడు భరత్ కుమార్, బీజీవీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శివ నాయక్, పీడీఎస్యూ జిల్లా అధ్యక్షుడు బి. వెంకటేష్, ఎమ్మెల్యే కంటెస్టెంట్ అభ్యర్థి దయానంద్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పరుశరాముడు, టీజీవిబి జిల్లా అధ్యక్షుడు రవి పాల్గొన్నారు.








# ఘనంగా ప్రజా పాలన దినోత్సవం

**వారధి న్యూస్ పెబ్బేరు:** పెబ్బేరు మండలంలో ప్రజా పాలన దినోత్సవము ను ప్రభుత్వ కార్యాలయాలలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలం లో ఎంపీడీవో, ఎం ఆర్ ఓ, మున్సిపల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ లలో జాతీయ పతాకాన్ని ఎగురవేసి ప్రజాపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ ఎద్దుల కరుణ శ్రీ సాయినాథ్ కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్చత హి సేవ కార్యక్రమం లో భాగంగా స్వచ్ఛత ప్రతిజ్ఞ ని అందరిచే చేయించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కర్రె స్వామి వార్డు కౌన్సిలర్ లు సువర్ణ వెంకట రాములు, గోపిబాబు, కొ ఆప్షన్ సభ్యులు ఐజాక్ మున్సిపల్ కమిషనర్ కె. అదిశేషు , గణేష్ బాబు, జూనియర్ అసిస్టెంట్ భూరణ్, బిల్ కలెక్టర్ కృష్ణయ్య, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ యోగేష్ కుమార్, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com




## కేజీబీవీ విద్యాలయాల్లో ఆహార పదార్థాల పంపిణీల్లో నిర్దేశిత ప్రమాణాలను విధిగా పాటించాలి

- సమగ్ర శిక్ష గణాంకాధికారి మధుసూదన్ రెడ్డి

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో**:కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యార్థినిలకు అందించి ఆహారం, వంట, వడ్డించు అంశాలలో నిర్దేశించిన ప్రామాణికంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక అధికారులు విధిగా చర్యలు తీసుకోవాలని సమగ్ర శిక్ష గణాంక అధికారి మధుసూదన్ రెడ్డి ఆదేశించారు.బుధవారం డిఈఓ కార్యాలయ సమావేశ మందిరంలో కేజీబీవీ ప్రత్యేక అధికారులకు ఆహార పదార్థాల నాణ్యత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....కేజీబీవీ విద్యార్థినిలకు ఆహార పదార్థాలు, వంటలు, సరుకులను ప్రామాణికాన్ని ప్రత్యేక అధికారులు విధిగా పరిశీలించి విద్యార్థులకు పంపిణీ చేయాలని ఆయన సూచించారు.వంట మనుషులు వండి ఆహార పదార్థాలను ఒకటికి రెండుసార్లు శుభ్రపరిచి వండే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. వంట మనుషులు, వంట చేసే పరిసరాలు అత్యంత శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. బాలికల ఆరోగ్య విషయంలో అలసత్వం ప్రదర్శించకుండా పూర్తిస్థాయి సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యా ప్రమాణాలను పెంచేందుకు ప్రత్యేక ప్రణాళిక చర్యలను చేపట్టాలని ఆదేశించారు. కేజీబీవీ పర్యవేక్షణ అధికారిని శోభారాణి మాట్లాడుతూ....కస్తూరిబా బాలికల విద్యాలయాల్లో విద్యార్థినిలకు మెరుగైన విద్యతోపాటు నాణ్యమైన రుచికరమైన భోజనాన్ని అందేలా చూడాలని సూచించారు.రానున్న ఇంటర్, పదవ తరగతి పరీక్షల్లో 100% ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటినుండి ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని 20 కేజీబీవీల్లో వివిధ సబ్జెక్టుల వారీగా ఖాళీగా ఉన్న 42 సిఆర్టిల భర్తీ చేసేందుకు జిల్లా కలెక్టర్ గారి ఆమోదంతో ఇదివరకే రోస్టర్ పాయింట్ ద్వారా ఉన్న జాబితా నుండి భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. నవంబర్లో నిర్వహించే న్యాస్ పరీక్షల నాటికి బాలికల విద్యా ప్రమాణాలను మరింతగా పెంపొందించాలన్నారు. సెక్టోరియల్ అధికారులు షర్ఫుద్దీన్, నూరుద్దీన్, మురళీధర్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు





## అమరుల త్యాగాల ఫలితమే తెలంగాణ

**వారధి న్యూస్, మహబూబ్ నగర్**:తెలంగాణ రాష్ట్రం ఏర్పడినది అమరుల త్యాగాల ఫలితమేనని, వారి త్యాగాలను స్మరించుకుంటూ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని రాష్ట్ర ఎక్సైజ్, ప్రొహిబిషన్, సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం, మహబూబ్ నగర్ సమీపంలోని పాలకొండ వద్ద ఉన్న సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవన సముదాయంలో ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.అనంతరం ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులకు సత్వరమే అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు. ప్రజలు అందించే విజ్ఞాపనలకు తక్షణ పరిష్కారం చూపించాలనీ, ప్రతి అధికారి తన పరిధిలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు.అర్హులకు పథకాలు జాప్యం లేకుండా చేరాలని, ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. ముఖ్యంగా భూములకు సంబంధించిన సమస్యలపై ఎలాంటి తప్పులు జరగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.





## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించిన రాచాల యుగంధర్ గౌడ్

**వారధి న్యూస్, వనపర్తి**: సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన 3 లక్షల రూపాయల చెక్కును మంగళవారం నాడు కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాచాల యుగంధర్ గౌడ్ లబ్ధిదారుడు మేడిశెట్టి రాజుకు హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా రాచాల యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో మంజూరైన చెక్కును అప్పటి బిఆర్ఎస్ నాయకులు తీసుకొని లబ్ధిదారునికి ఇవ్వకుండా చించివేశారని ఆరోపించారు. అయితే, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సహకారంతో మంజూరు చేయించడంతో లబ్ధిదారుడికి న్యాయం చేయగలిగామని ఆయన అన్నారు. లబ్ధిదారుడు మేడిశెట్టి రాజు మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో ఆయనకు మంజూరైన చెక్కును అప్పటి ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర రెడ్డి, కొత్తకోట ఎంపిపి భర్త గుంత మల్లేష్ తదితరులు కుట్ర పన్ని ఇవ్వకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రాచాల యుగంధర్ గౌడ్ విషయాన్ని తెలియజేయడంతో, ఆయన ఉన్నతాధికారులతో మాట్లాడి 3 లక్షల రూపాయల చెక్కును అందజేయించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రాచాల యుగంధర్ గౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అంజన్న యాదవ్, మ్యాదరి రాజు తదితరులు పాల్గొన్నారు




## ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగురవేసిన అడిషనల్ ఎస్పీ రామదాసు తేజావత్

**వారధి న్యూస్, వనపర్తి**: తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం 2024 సందర్భంగా, వనపర్తి జిల్లా అడిషనల్ ఎస్పీ శ్రీ రామదాసు తేజావత్ జాతీయ జెండాను ఎగురవేసి వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా, అడిషనల్ ఎస్పీ రామదాసు తేజావత్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 17న జరుపుకుంటారని, ఇది 1948లో తెలంగాణ ప్రాంతం హైదరాబాదు సంస్థానాన్ని స్వతంత్ర భారతదేశంలో విలీనం చేసిన రోజుగా గుర్తు చేస్తూ జరుపుకుంటారని వివరించారు. రాచరిక పాలన, దొరల దాష్టీకం అంతమైన సందర్భంలో భారతావనిలో విలీనంతో మొదలైన ప్రజాస్వామిక ప్రస్థానం ప్రజాపాలనలో విజయవంతమైన సందర్భంగా, ప్రజలందరికీ మరియు వనపర్తి జిల్లా పోలీసు సిబ్బందికి తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పి జై వెంకటేశ్వరరావు, వనపర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ నాగభూషణం, సి.సి.ఎస్.సి ఐ శ్రీ రవి పాల్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ శ్రీ అప్పలనాయుడు, కొత్తకోట సిఐ శ్రీరాం బాబు, ఎస్.బి.ఎస్.ఐ శివ కుమార్, అంజద్ ఎస్సై, పానగల్ ఎస్సై శ్రీనివాసులు, ఆర్ ఎస్ ఐ లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 కార్యక్రమానికి కేంద్ర ప్రభుత్వం శ్రీకారం

**వారధి న్యూస్, నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో**: ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్ లో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రధాన మంత్రి ఆవాస్ యోజన అర్బన్ 2.0 కార్యక్రమాన్ని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా లాంఛనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ 5 సంవత్సరాల్లో రూ. 10 లక్షల కోట్లతో రూ. కోటి పట్టణ గృహాలను నిర్మించేందుకు ప్రణాళిక రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. సంక్షేమ కార్యక్రమాల అమలులో భారతదేశం ముందంజలో ఉందని, పట్టణంలో నివసించే పేదలకు, మధ్య తరగతి ప్రజలకు బాసటగా నిలిచేందుకే ఈ పథకం ప్రవేశ పెట్టడం జరిగిందని తెలిపారు.మంగళవారం నాడు, నాగర్ కర్నూల్ జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో సమావేశ మందిరం నుంచి అదనపు కలెక్టర్ దేవ సహాయం మునిసిపల్ శాఖా అధికారులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.




## విలీన దినోత్సవంను అధికారికంగా నిర్వహించాలి

- సీపీఐ

**వారధి న్యూస్, మహబూబ్ నగర్**: సెప్టెంబర్ 17ని విలీన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని సిపిఐ (కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా) డిమాండ్ చేసింది. మంగళవారం గద్వాల జిల్లా కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల ముగింపు సందర్భంగా సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో, ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో గోపాల్ రావు అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి. ఆంజనేయులు, నడిగడ్డ ఉద్యమ నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు, అతికూర్ రహిమాన్, రైతంగా సమితి నాయకులు గోపాల్ యాదవ్, లెక్చరర్ పరేష్ బాబు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమ ప్రారంభంలో తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు రెండు నిమిషాలు మౌన నివాళులు అర్పించారు. సిపిఐ నాయకులు మాట్లాడుతూ, నైజాం నవాబును తరిమికొట్టిన కమ్యూనిస్టులను, సాయుధ రైతాంగ పోరాటాలను కనుమరుగు చేయడం ఎవరి తరమో కాదని చెప్పారు. సెప్టెంబర్ 17ని విలీన దినోత్సవంగా నిర్వహించడం అనివార్యమని, కానీ 'ప్రజాపాలన దినోత్సవం' అనే పేరుతో జరపడం సరైనది కాదని అభిప్రాయపడ్డారు. కమ్యూనిస్ట్ యోధులను, వారి పోరాటాలను ప్రజలు గుర్తుచేసుకోవాలని, బిజెపి పార్టీ ఆ పోరాటాలను హైజాక్ చేయాలని ప్రయత్నించడం వారి అవివేకాన్ని చూపుతుందని వ్యాఖ్యానించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సభ్యులు అశన్న, కాశీం, AISF జిల్లా కార్యదర్శి ప్రవీణ్, రైల్వే పాషా, రైతు సంఘం నాయకులు హమాలీ ట్రాన్స్పోర్ట్ కార్మికులు మస్తాన్, ధర్మన్న, తిమ్మప్ప, వెంకటేశు, ప్రభుదాసు తదితరులు పాల్గొన్నారు.








## తెలంగాణ ఆత్మగౌరవం, న్యాయం కోసం బి.ఆర్.ఎస్ పార్టీ నిరసన

**వారధి న్యూస్, వనపర్తి**: మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి నేతృత్వంలో బి.ఆర్.ఎస్ పార్టీ యొక్క పిలుపు మేరకు, సచివాలయంలో రాజీవ్ గాంధీ విగ్రహం ఏర్పాటు చేయడంపై నిరసనగా మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించబడింది. జమ్మి చెట్టు చౌరస్తా నుండి ప్రారంభమైన ర్యాలీ గోపాల్ పేట మండల కేంద్రము చేరుకొని, అక్కడ తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేశారు.నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, నిజాం ప్రభుత్వాన్ని భారత యూనియన్ లో విలీనం చేసిన తరువాత, నెహ్రూ ప్రభుత్వం తెలంగాణను ఆంధ్రా తో కలపడం వల్ల 1969 నుండి 1972 వరకు తెలంగాణ ఆత్మగౌరవం కోసం ప్రజలు పోరాటం చేసి 369 మంది అమరులు అయ్యారని గుర్తుచేశారు. 30 సంవత్సరాల సమైక్య రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రజలు తీవ్ర నష్టాన్ని అనుభవిస్తున్నారని, కె.సి.ఆర్ నాయకత్వంలో ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగి, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలలో ఉచిత బస్సు తప్ప ఇంకొక గ్యారంటీ అమలు చేయకపోవడం వల్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలల్లో రాష్ట్రాన్ని విధ్వంసం చేసినట్లు ఆరోపించారు.సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసే నిర్ణయించిన స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉందని విమర్శించారు.అంబేద్కర్ సచివాలయం ముందు రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టడం నచించకపోవడంతో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ అంగీకరించలేదని, గత కె.సి.ఆర్ ప్రభుత్వం నిర్ణయించిన స్థలంలో తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేయడం సముచితమైందని తెలిపారు.ఇదిలా ఉంటే, బి.ఆర్.ఎస్ ప్రభుత్వం రావడం ఖాయమని, రాజీవ్ గాంధీ విగ్రహాన్ని గాంధీ భవన్ కు తరలించి, అక్కడ తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, పి. రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, జాత్రు నాయక్, మాజీ Z.P.T.C చంద్రశేఖర్ నాయక్, కౌన్సిలర్లు బండారు కృష్ణ, నాగన్న యాదవ్, కంచే రవి, కో. అప్షన్ సభ్యులు ఉస్మాన్, మండల నాయకులు రఘువర్ధన్ రెడ్డి, రవిప్రకాష్ రెడ్డి, ధర్మానాయక్, మహేశ్వర్ రెడ్డి, మాధవ్ రెడ్డి, దేవర్ల నరసింహ, గోపాల్ పేట అధ్యక్షులు బి. బాలరాజు, మాజీ ఎం.పి.పి సంధ్య తిరుపతయ్య, చంద్రశేఖర్, రాజేష్ గౌడ్, మతీన్, శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.





www.varadhinews.com
వారధి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్

## రాజీవ్ గాంధీ విగ్రహం అంటే వ్యతిరేకం ఎందుకు



**వారధి న్యూస్ పెబ్బేరు:** దేశ భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలన్న సమున్నతమైన ఆశయంతో మాజీ ప్రధానమంత్రి, స్వర్గీయ రాజీవ్ గాంధీ అనేక విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చారని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కారుపాకుల వెంకట రాములు యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సచివాలయం ఎదుట ఏర్పాటు చేసిన రాజీవ్ గాంధీ విగ్రహాన్ని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ఆయన ప్రశ్నించారు, రాజీవ్ గాంధీ, వారి కుటుంబం దేశం కోసం చేసిన త్యాగాలను గుర్తుచేశారు.దేశ భవితవ్యాన్ని యువత నిర్దేశించాలన్న లక్ష్యంతో 18 ఏళ్లకు ఓటు హక్కు కల్పించడం, పంచాయతీలే గ్రామీణాభివృద్ధి గా విశ్వసించి వాటికి నేరుగా నిధులు చేర్చాలన్న సంకల్పంతో 73, 74 వ రాజ్యాంగ సవరణ చేయడం జరిగిందనీ.చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం, సాంకేతిక విప్లవంతోనే దేశాన్ని 21 శతాబ్దంలోకి నడిపించడం వంటి వాటిని రాజీవ్ గాంధీ తీసుకొచ్చిన సంస్కరణలను తెలిపారు. దేశం కోసం నెహ్రూ కుటుంబం సర్వం కోల్పోయిందని, నెహ్రూ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత దేశాన్ని ప్రగతి బాటన నడిపించడానికి ఆనాడు ఎడ్యుకేషన్, ఇరిగేషన్ వాటిని అభివృద్ధి చేయడానికి ఎంతోఅయన కృషి చేశారని తెలిపారు.

## వాస్తు శిల్పి, ప్రతిమశాస్త్ర పితామహుడు విరాట్ విశ్వకర్మ

- **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**వారధి న్యూస్, మంచిర్యాల:** మంగళవారం నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన విశ్వకర్మ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, విరాట్ విశ్వకర్మను వాస్తు శిల్పి మరియు ప్రతిమశాస్త్ర పితామహుడిగా అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్ తో కలిసి, విరాట్ విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేశారు.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, విరాట్ విశ్వకర్మ వాస్తు ప్రకారం పట్టణాలు మరియు భవనాల నిర్మాణంలో ఎంతో మార్గదర్శకత్వం అందించారనీ, మరియు భూమిపై జరిగే నిర్మాణాలలో నైపుణ్యాలు పెంచుకోవాలనీ చెప్పారు. ఆయన అభిప్రాయం ప్రకారం, వాస్తు ప్రకారంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగేందుకు, మన సంస్కృతిలో విగ్రహాల రూపకల్పనపై భావితరాలకు దిశానిర్దేశం అందించిన మహనీయుడు విరాట్ విశ్వకర్మ అని చెప్పారు.ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి వినోద్ కుమార్, జిల్లా శాఖల అధికారులు, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు కస్తూరి శ్రీనాథ్ చారి, ప్రధాన కార్యదర్శి రావుల హరీష్ చారి, రాష్ట్ర విశ్వకర్మ వర్కింగ్ ప్రెసిడెంట్ పాలికోజు నర్సింహాచారి, ఓ.బి.సి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగన్న

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



**వారధి న్యూస్, చేవెళ్ళ:** కేంద్రరాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఈ నెల 17నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో స్వభావ స్వచ్ఛతసంస్కార్ స్వచ్ఛత నినాదంతో 'స్వచ్ఛతాహి సేవ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం "తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం" సందర్భంగా మొయినాబాద్ మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో మొక్కలు నాటడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేకాధికారి డా. వెంకట్ యాదవ్, పంచాయతీ కార్యదర్శి తారబాయి మాట్లాడుతూ, గ్రామంలోని ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు మరియు వీధులను పరిశుభ్రంగా ఉంచేందుకు వ్యక్తిగతంగా ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ళ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొట్టం నర్సింహా రెడ్డి, రెడ్డిమోని యాదయ్య, గొడుగు యాదయ్య, ఇట్యాల సిద్దయ్య, జంగిటి మహేందర్, అనిమోని మల్లేష్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



## విఘ్నేశ్వరుల సేవలో మాజీ మంత్రి హరీష్ రావు

**వారధి న్యూస్, మెదక్:** మెదక్ పట్టణంలో నెలకొల్పిన వినాయక మండపాలను మాజీ మంత్రి హరీష్ రావు మంగళవారం సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో ఎలాంటి ఆటంకాలు లేకుండా అందరూ బాగుండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భనలో మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెళ్ల మల్లికార్జున్ గౌడ్, మాజీ చైర్మన్ బట్టి జగపతి, కౌన్సిలర్లు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, జయరాజు, ఆర్కే శ్రీనివాస్, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి గడ్డమీద కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**పరామర్శలు:**

మెదక్ నియోజకవర్గంలో మాజీ మంత్రి హరీష్ రావు పలువురిని పరామర్శించారు. మెదక్ మున్సిపల్ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు తల్లి మామిళ్ళ గంగమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో స్వగ్రామం జక్కన్నపేటకు వెళ్లి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. ఆంజనేయులతో పాటు సోదరులు డాక్టర్ కిషన్, నర్సింలు కుటుంబ సభ్యులను ఓదార్చారు.మెదక్ జిల్లా రైతు సమన్వయ కమిటీ మాజీ అధ్యక్షులు తాడేపు సోములు సోదరుడు సుధాకర్ మరణించడంతో పాపన్నపేట మండలం ఎల్లాపూర్ లో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున గౌడ్, కౌన్సిలర్లు ఆకిరెడ్డి కృష్ణారెడ్డి, బీమరి కిషోర్, జయరాజు, నాయకులు ప్రభురెడ్డి, చామంతుల సత్యనారాయణ, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాసేవకు కట్టుబడి ఉండాలి

- **పోలీసు కమిషనర్ సుధీర్ బాబు**

**వారధి న్యూస్, మల్కాజిగిరి** ప్రజా సేవే పరమావధిగా పోలీసుల పని చేయాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దినాన్ని నిర్వహించాలని నిర్ణయించడంతో, మంగళవారం రాచకొండ కమిషనరేట్ పరిధిలోని అంబర్ పేట ఆర్మ్డ్ పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో ప్రజాపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం స్వాతంత్రం ఏర్పడిన నాటి నుండి అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందని తెలిపారు. రైల్వే వ్యవస్థ, విద్యావ్యవస్థ, కమ్యూనికేషన్స్, ఆధునిక హాస్పిటల్స్, రవాణా వ్యవస్థ వంటి అంశాల్లో పురోగతి సాధించామని పేర్కొన్నారు. వివిధ వర్గాలు, కులాలు, మతాలు సంస్కృతులతో తెలంగాణ రాష్ట్రం సామరస్యంతో కొనసాగుతోందని, భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తోందని తెలిపారు. శాంతి, భద్రతల పరిరక్షణతోనే అభివృద్ధి, సామరస్య వాతావరణం సాధ్యమవుతుందని అన్నారు. పోలీసులు పౌర సేవలకు పునరంకితం కావాలని, పోలీసు వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలని, ప్రజలతో మమేకమై పని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్బీ డీసీపీ కరుణాకర్, ఏ. ఆర్. అడిషన్ డి సి పి లు శ్యామ్ సుందర్, వెంకటరెడ్డి, ఏసీపీ లు ఇమ్మానువల్, మహేశ్వర్, శైలేష్, నరేందర్, సురేష్ ఆర్ఐ లు, ఆర్ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.



## కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌ను
## కలిసిన ఎంపీ ధర్మపురి అరవింద్

**వారధి న్యూస్, నిజామాబాద్:** నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ మంగళవారం కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌ను ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో దేశంలో శాంతిభద్రతలపై కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన చట్టాలు మరియు వాటి అమలుపై చర్చించారు.తెలంగాణలో బీజేపీ పార్టీ బలోపేతం, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయంపై మంత్రి రాజ్ నాథ్ సింగ్ అడిగి తెలుసుకున్నారు. పార్టీ పటిష్టత కోసం కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా, మంత్రి రాజ్ నాథ్ సింగ్ పలు అంశాలపై సూచనలు మరియు సలహాలు అందించారు.



## గురుకులాల్లో కేర్ టేకేర్లను నియమించాలి


**వారధి న్యూస్, మోత్కూర్:** స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత, గురుకుల విద్యాలయాలు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొంటూ, కానీ ఆ గురుకులాల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు సమస్యల నిలయాలుగా మారాయని ఎద్దేవా చేశారు. అర్ధ మాసం ముగిసినా ఇంకా సిబ్బందికి జీతాలు చెల్లించకపోవడం బాధాకరమని చెప్పారు. సుమారు ఆరు వందల ప్రభుత్వ గురుకులాల్లో విద్యార్థుల, ఉపాధ్యాయుల కనీస అవసరాలు తీర్చుకునే పరిస్థితులు లేని అశాస్త్రీయ టైం టేబుల్, కేర్ టేకర్ విధులు, ఇతర బోధనేతర పనుల నుండి ఉపాధ్యాయులకు విముక్తి కల్పించాలని డిమాండ్ చేశారు.వినతి పత్రాలు మరియు శాస్త్రీయ విశ్లేషణలతో అసౌకర్య పరిస్థితులపై అవగాహన కల్పించినప్పటికీ, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకునే పరిస్థితి లేకపోవడం పట్ల నిరసన వ్యక్తం చేశారు. టీఎస్ యుటిఎఫ్, గురుకుల సంఘాల జేఏసీ రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీ పోరాటానికి పిలుపునిచ్చింది. ఈ నెల 28న జరగబోయే మహా ధర్నాకు గురుకుల ఉపాధ్యాయులంతా హాజరుకావాలని పిలుపు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం నరేష్, మధుసూధన్, క్రాంతి, నర్సింహ, వెంకన్న, సరిత, మమత పాల్గొన్నారు.



## విద్యార్థి నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి మహాసభ

- **ఈ నెల 22న వరంగల్లో బీసీ సంక్షేమ జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో**

**వారధి న్యూస్, భువనగిరి:** తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) వ్యవస్థాపక అధ్యక్షుడు కురెళ్ళ మహేష్ ఈ నెల 22న వరంగల్‌లో నిర్వహించబడబోయే విద్యార్థి యుద్ధభేరి మహాసభ గురించి సమాచారాన్ని అందించారు. ఈ సభ బీసీ సంక్షేమ జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో జరుగుతుంది.ఈ సందర్భంగా భువనగిరి పట్టణంలో విద్యార్థి నాయకులు మరియు విద్యార్థులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. కురెళ్ళ మహేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే, బీసీ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నెల 22న వరంగల్‌లో నిర్వహించబోయే మహాసభకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఎస్ఏ విద్యార్థి ఉద్యమ నాయకులు సోనిక, పూజిత, నందిని, మమత, అశ్విని తదితరులు పాల్గొన్నారు.



## "కాంగ్రెస్ నాయకులపై మాట్లాడే అర్హత ఎవరికి లేదు"

- **మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**

**వారధి న్యూస్, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో, తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా, కూన శ్రీశైలం గౌడ్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనమైన రోజును, ముఖ్యమంత్రి ప్రజా కోణాన్ని జోడించి తెలంగాణ ప్రజా పాలన దినోత్సవంగా నిర్వహించడం శుభ పరిణామమని పేర్కొన్నారు.

అదేవిధంగా, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ పై విమర్శలు చేశారు. టిడిపిలో గెలిచి బీఆర్ఎస్ పార్టీలో చేరిన వివేకానంద్ కు కాంగ్రెస్ నాయకులపై మాట్లాడే అర్హత లేదని స్పష్టం చేశారు.ఎన్నికల ముందు వివేకానంద్ తనపై దాడి చేసాడని, తనకు సంస్కారం ఉండి తిరిగి దాడి చేయలేదని వివరించారు. రాష్ట్రంలో భద్రత గురించి వివేకానంద్ మాట్లాడడం హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. వివేకానంద్ తన భాష మార్చుకోకపోతే కుత్బుల్లాపూర్ లో తిరగలేరని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొంటి రెడ్డి పున్నారెడ్డి, కౌన్సిలర్లు రాము గౌడ్, బైరి ప్రశాంత్ గౌడ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## ములుగు జిల్లా అభివృద్ధి దిశగా కొత్త అడుగులు నాసిరెడ్డి సాంబశివరెడ్డి

**వారధి న్యూస్, మంగపేట:** రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క నాయకత్వంలో ములుగు జిల్లా అభివృద్ధి బాట పట్టిందని జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ మెంబర్ మరియు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నాసిరెడ్డి సాంబశివరెడ్డి తెలిపారు. మంగళవారం, అకినేపల్లి మల్లారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా పాలన దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు.ఈ సందర్భంగా, సాంబశివరెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు మరియు పేదల అభ్యున్నతికి అనేక పథకాలను అమలు చేస్తోందని, మంత్రి సీతక్క సహకారంతో ప్రతి పల్లెలో అభివృద్ధి మరియు ప్రగతి అందే విధంగా కృషి చేస్తుందని చెప్పారు. మండల కేంద్రంలో నూతన బస్టాండ్ నిర్మాణాన్ని త్వరలో మంత్రి సీతక్క ప్రారంభిస్తారని తెలిపారు. మంత్రి సీతక్క మరియు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే వారికి అభివృద్ధి అనే ఆయుధంతోనే సమాధానం ఇస్తామని అన్నారు.

అయితే, రూ. రెండు లక్షల పైబడిన రైతులందరికీ తమ ప్రభుత్వం రుణమాఫీ వర్తింప చేస్తుందని, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టిందని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఆమని పతాకావిష్కరణ చేసి, స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహించి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో నాసిరెడ్డి నాగిరెడ్డి, ధూళిపాల బాలకృష్ణ, లక్కీ వెంకన్న, డబ్బుల ముత్యాలరావు, చెట్టుపెల్లి వెంకటేశ్వర్లు, ఆనందం అంగన్ వాడి సిబ్బంది, ఆశ వర్కర్ తదితరులు పాల్గొన్నారు.



## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- **కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ ఉత్తర్వులు జారీ**

**వారధి న్యూస్, హత్నూర:** ప్రజా పాలనలో భాగంగా, మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మంగళవారం పి హెచ్ సి సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పి హెచ్ సి కి సంబంధించి సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించగా, శ్రీ కే రమేష్, రాధాకృష్ణ, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్, అబ్దుల్ షకీల్ విధులకు హాజరై నలుగురు వారు హాజరు లేనట్టుగా గుర్తించారు.ఈ నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ, విధుల పట్ల బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్న రమేష్, రాధాకృష్ణ, మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ అబ్దుల్ షకీల్ లను సస్పెండ్ చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీరామ్ కు ఆదేశాలు జారీ చేశారు.జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, జిల్లాలో సమర్థవంతమైన పాలనను అందించడానికి, ప్రభుత్వ అభివృద్ధి మరియు సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో క్షేత్రస్థాయిలో అధికారులు మరియు సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. ఆకస్మిక పర్యటనలు తరచుగా నిర్వహించబడుతాయని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించే వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com
GENERAL NEWS
జనరల్ న్యూస్



# బై.. బై.. గణేశా..

**వారధి, స్టేట్ బ్యూరో:**

భాగ్యనగరంలో గణేశ్ నిమజ్జన శోభా యాత్ర ఘనంగా సాగింది. ఖైరతాబాద్ గణేషుడు మధ్యాహ్నం ఒకటి తర్వాత హుస్సేన్ సాగర్‌లో గంగమ్మ ఒడిని చేరాడు. ఖైరతాబాద్ గణేశుడిని ఏర్పాటు చేసి 70 ఏళ్లు అయిన సందర్భంగా 70 అడుగుల ఎత్తులో భారీ మట్టి గణేషుడిని ఏర్పాటు చేసింది ఉత్సవ కమిటీ. ఈ ఏడాది శ్రీ సప్త ముఖ మహాశక్తి గణపతిగా భక్తుల పూజలు అందుకున్న వినాయకుడు మంగళవారం మధ్యాహ్నం గంగమ్మ ఒడికి చేరాడు. అంతకుముందు శోభాయాత్ర మొత్తం రెండున్నర కిలో మీటర్ల మేర సాగింది. ఖైరతాబాద్, సెన్సేషనల్ థియేటర్, రాజ్ దూత్ హోటల్, టెలిఫోన్ భవన్, తెలుగు తల్లి ఫ్లై ఓవర్, సెక్రటేరియట్, ఎన్టీఆర్ మార్గ్ వరకు శోభాయాత్ర కొనసాగింది. ఎన్టీఆర్ మార్గ్‌లో ఏర్పాటు చేసిన 4వ నెంబర్ సూపర్ క్రేన్ ద్వారా ఖైరతాబాద్ గణేశుడిని నిమజ్జనం చేశారు. ఖైరతాబాద్ గణేష్ నిమజ్జనం సందర్భంగా ట్యాంక్‌బండ్ జనసంద్రమైంది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు నిమజ్జన పర్వాన్ని పూర్తిగా వీక్షించి ఇంటి దారిపట్టారు. జీహెచ్ఎంసీ పరిధిలో దాదాపు లక్ష విగ్రహాలు నిమజ్జనానికి తరలి వస్తున్నాయి. ఈ ఏడాది 30 వేల విగ్రహాలు ఒక్క హుస్సేన్ సాగర్‌లోనే నిమజ్జనం అయ్యాయి. బుధవారం ఉదయం వరకు కూడా నిమజ్జన కార్యక్రమం కొనసాగే అవకాశం ఉంది.







# గణేశ్ లడ్డూ @ 1.87 కోట్లు

**బండ్లగూడ కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో రికార్డు ధర**

**గతేడాది 1.20 కోట్లు పలికిన లడ్డూ**

**వారధి, స్టేట్ బ్యూరో**

హైదరాబాద్ బండ్లగూడ జాగీర్‌లో గణేశ్ లడ్డూ వేలం పాట రికార్డు సృష్టించింది. ఈ ప్రాంతంలోని కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో నిర్వహించిన వేలం పాటలో లడ్డూ ఏకంగా రూ.1.87 కోట్లు పలికింది. గతేడాది ఇదే ప్రాంతంలో నిర్వహించిన వేలంలో రూ.1.20 కోట్లకు లడ్డూను దక్కించుకోగా, ఈసారి దానిని మించి ధర పలకడం విశేషం. ఈ ఏడాది అత్యధికంగా రూ.1.87 కోట్లకు దక్కించుకోవడంతో గతేడాది రికార్డు బ్రేక్ అయినట్లయింది. గత 11 ఏళ్ల నుంచి కీర్తి రిచ్‌మండ్ విల్లాస్‌లో గణేశ్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పదకొండో రోజున నిమజ్జనం చేస్తారు. ఆ రోజునే ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి లడ్డూ వేలం పాట మొదలుపెడతారు. అయితే ఈ వేలం పాటలో విల్లాలో ఉన్నవారు మాత్రమే పాల్గొంటారు. లడ్డూ ఎవరికి దక్కినా అందరూ కలిసి సేవా కార్యక్రమాల కోసం ఆ డబ్బును వినియోగిస్తారు. ఒక్క రూపాయి కూడా వ్యక్తిగత అవసరాల కోసం వాడరు.













వారధి
తెలుగు దిన పత్రిక
www.varadhinews.com


Movie Time మూవీ టైమ్

# జోరుమీదున్న 'రఘుతాత'



మహానటి కీర్తి సురేష్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'రఘు తాత'. హోంబళే ఫిల్మ్స్ బ్యానర్ మీద విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రానికి సుమన్ కుమార్ దర్శకత్వం వహించారు. ఈ మూవీకి ఆడియెన్స్ థియేటర్లో మంచి రెస్పాన్స్‌ను ఇచ్చారు. ప్రస్తుతం ఈ చిత్రం ఓటీటీలోకి రాబోతోంది. సెప్టెంబర్ 13 నుంచి తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో ఈ చిత్రం జీ5లో స్ట్రీమింగ్ అవుతోంది. వైవిధ్యమైన పాత్రలు, కథాంశంతో రూపొందిన 'రఘు తాత' చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. నమ్మిన దాని కోసం నిలబడే స్వతంత్ర్య భావాలున్న అమ్మాయి పాత్రలో కీర్తి సురేష్ నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఫ్యామిలీ ఆడియెన్స్ అందరూ కలిసి చూసే ఎమోషనల్ మూవీగా అలరిస్తోంది. అందుకనే విడుదలైన 24 గంటల్లోనే ఈ చిత్రానికి 50 మిలియన్ స్ట్రీమింగ్ రావటం విశేషం. కుటుంబంతో కలిసి 'రఘు తాత' సినిమాను ఎంజాయ్ చేయటానికి జీ5 ను సబ్‌స్క్రైబ్ చేసుకోండి.

# తగ్గేదేలే అంటున్న త్రిప్తి దిమ్రి



'యానిమల్' సినిమాతో అందరి దృష్టిని ఆకర్షించిన బాలీవుడ్ ముద్దుగుమ్మ త్రిప్తి దిమ్రి. ఈ బ్యూటీ 'యానిమల్' కి ముందు ఐదు సినిమాలలో నటించింది. అయితే వాటిలో ఏ ఒక్క సినిమాకి ఆమెకి గుర్తింపు తీసుకురాలేదు. 'యానిమల్' చిత్రంలో ఆమె క్యారెక్టర్ నిడివి తక్కువే అయిన కూడా బోల్డ్ గా నటించి మెప్పించింది. దీంతో 'యానిమల్' సినిమా తర్వాత ఆమె పేరు బిటౌన్ లో గట్టిగా వినిపించడం మొదలైంది. బాలీవుడ్ లో వరుసగా అవకాశాలు క్యూ కడుతున్నాయి. బ్యాక్ టూ బ్యాక్ సినిమాలతో త్రిప్తి ప్రస్తుతం బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ కేటగిరీలోకి వెళ్ళిపోయింది. 'యానిమల్' తో రష్మిక బాలీవుడ్ లో స్టార్ హీరోయిన్ అవుతుందని అందరూ అనుకుంటే త్రిప్తి డిమ్రి ఆ ఛాన్స్ కొట్టేసింది. రీసెంట్ గా ఆమె విక్కీ కౌశల్ కి జోడీగా 'బ్యాడ్ న్యూస్' అనే మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ మూవీ సూపర్ హిట్ అయ్యింది. ప్రస్తుతం ఆమె చేతిలో మూడు సినిమాలు ఉన్నాయి. 'విక్కీ విద్యా కా వో వాలా వీడియో'లో చేస్తోంది. కార్తిక్ ఆర్యన్ లీడ్ రోల్ లో టి-సిరీస్ లో తెరకెక్కుతోన్న 'భూల్ భూలయ్యా 3' మూవీలో త్రిప్తి ఛాన్స్ కొట్టేసింది. అలాగే కరణ్ జోహార్ నిర్మిస్తోన్న 'ధడక్ 2'చిత్రంలో కూడా త్రిప్తి మెయిన్ హీరోయిన్ గా కన్ఫర్మ్ అయ్యింది. ఇవన్నీ పెద్ద బ్యానర్స్ నుంచి వస్తున్న సినిమాలే కావడం విశేషం. ప్రస్తుతం క్రేజీ హీరోయిన్ గా దూసుకుపోతున్న త్రిప్తి ఏకంగా 5 కోట్ల వరకు రెమ్యునరేషన్ తీసుకుంటుందని తెలుస్తోంది. బాలీవుడ్ లో హైయెస్ట్ రెమ్యునరేషన్ అందుకుంటున్న హీరోయిన్స్ లలో దీపికా పదుకునే మొదటి స్థానంలో ఉంది. తరువాత కంగనా రనౌత్, అలియా భట్, శ్రద్ధా కపూర్, అనుష్క శర్మ, కత్రినా కైఫ్ లాంటి స్టార్ హీరోయిన్స్ ఉన్నారు.



# సెప్టెంబర్ 27న స్ట్రీమింగ్ కానున్న 'డీమాంటే కాలనీ 2'

నిద్ర లేని రాత్రి కోసం సిద్ధంగా ఉన్నారా!.. ఇండియాలో వైవిధ్యమైన సినిమాలు, సిరీస్‌లతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ టాప్ పొజిషన్‌లో దూసుకెళ్తోన్న సంస్థ జీ5. రఘుతాత, నునక్కుళి వంటి ఫ్యామిలీ బ్లాక్‌బస్టర్స్‌ను అందించిన జీ 5.. ఈసారి భయంతో థియేటర్స్‌లో ప్రేక్షకులను మెప్పించి బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించిన 'డీమాంటే కాలనీ 2'తో మెప్పించటానికి సిద్ధమైంది. వెన్నులో వణుకు పుట్టించేలా తెరకెక్కిన ఈ చిత్రం సెప్టెంబర్ 27 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కానుంది. సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అజయ్ జ్ఞానముత్తు ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. అరుల్‌నిధి, ప్రియా భవానీ శంకర్ అద్భుతమైన నటనతో సీట్ ఎడ్జ్‌లో ప్రేక్షకులను కూర్చోపెట్టారు. తమిళ్ సినీ హిస్టరీలో ఫ్రాంచైజీగా రూపొందిన 'డీమాంటే కాలనీ2' రూ.55 కోట్ల గ్రాస్ కలెక్షన్స్‌ను సాధించింది. ప్రేక్షకులను భయానికి గురి చేసిన లార్డ్ డీమాంట్, సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకు మరోసారి వస్తున్నారు. 'డీమాంటే కాలనీ 2' చిత్రం ప్రేక్షకులను వెన్నులో వణుకు పుట్టించే అనుభవానికి గురి చేసింది. శాపభరితమైన ఓ బంగారు గొలుసును దొంగలించటానికి కొంతమంది స్నేహితులు ప్రయత్నిస్తారు. దాంతో నిద్రావస్థలోని భయంకరమైన ఆత్మ మేల్కొంటుంది. ఆ దుష్ట ఆత్మ ప్రతీకార చర్య నుంచి తమ స్నేహితులను కాపాడుకోవటానికి కొంతమంది ధైర్యవంతులైన స్నేహితులు ఏకం అవుతారు. ఘన విజయం సాధించిన 'డీమాంటే కాలనీ'కి కొనసాగింపుగా రూపొందిన 'డీమాంటే కాలనీ 2'.. ముందు చిత్రాన్ని మించేలా ఆసక్తికరమైన హారర్, థ్రిల్లింగ్ అంశాలతో తెరకెక్కింది. అంతే కాకుండా తొలి భాగం కంటే కూడా భయానకమైన సన్నివేశాలతో ప్రేక్షకులకు గొప్ప సినిమాటిక్ ఎక్స్‌పీరియెన్స్‌ను అందించేలా 'డీమాంటే కాలనీ 2' తెరకెక్కింది.